# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం ,5 ఫిబ్రవరి 2026


## ఈవిఎం గోదాము వద్ద పటిష్ట బందోబస్తు చర్యలు

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**

జిల్లా కేంద్రంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఈవిఎం లు భద్రపరిచిన గోదామును నెలవారి తనిఖీలలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, శిక్షణ ఐ.ఎఫ్.ఎస్. అధికారి భార్గవ్ కుమార్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచిన స్థలంలో బందోబస్తు చర్యలు పకడ్బందీగా చేపట్టడం జరిగిందని, సిసి కెమెరాల ద్వారా 24 గంటలు పర్యవేక్షి ంచడం జరుగుతుందని, సిసి కెమెరాలు ఎల్లవేళలా పనిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.






- పోటీ చేసిన అభ్యర్థులకు బీఫామ్ లు అందజేసిన ప్రధాన పార్టీలు
- పోటీ చేసిన అభ్యర్థులకు బీఫామ్ లు అందజేసిన ప్రధాన పార్టీలు
- బీఫామ్ రాక పోవడంతో గోడలు దూకిన ఆశావాహుల

**చెన్నూరు టౌన్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

నిన్నటి వరకు ఇది నా పార్టీ, నా కండువా, అని గొప్పలు చెప్పుకుంటూ తిరిగిన వారు నేడు పార్టీ బీఫామ్ ఇవ్వకపోవడంతో క్షణాల్లో కండువాలు మార్చి తమ నాయకులకు తలనొప్పిగా మారారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాలిటీలో 18 వార్డులకు గాను 159 మంది అభ్యర్థులు పోటీ చేశారు. మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ సందర్భంగా 52 మంది అభ్యర్థులు పోటీ నుంచి తప్పుకోగా 107 మంది బరిలో నిలిచినట్టు అధికారులు తెలిపారు. కాంగ్రెస్ 18, బీఆర్ఎస్ 18, బీజేపీ 18, ఆమాద్మీ పార్టీ 1, బహుజన సమాజ్ వాది పార్టీ 1, సీపీఎం 1, ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ 05, సీపీఐ 03, జనసేన పార్టీ 04, స్వతంత్ర అభ్యర్థులు 38 మంది బరిలో నిలిచినట్లు, అభ్యర్థులకు గుర్తులు కూడా కేటాయించనునట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రధాన పార్టీల్లో బీఫాం లేకుండా పోటీ చేసిన అభ్యర్థులను తప్పించే ప్రయత్నంలో నాయకులు చతికిలపడ్డారు. పోటీ చేసిన అభ్యర్థులు మొదటి నుండి నేను పార్టీ కోసం పని చేశానని, నన్ను కాదని ఇతరులకు బీఫాం ఇస్తే రెబల్‌గా ఉంటామని తేల్చి చెప్పినట్లు సమాచారం. కొన్ని వార్డుల్లో గుట్టుచప్పుడు కాకుండా సదరు పోటీదారులకు అమ్యామ్యాలు ఆశచూపి పోటీ నుంచి తప్పించినట్లు గుసగుసలు వినిపించాయి. మిగతా 2లో..

## విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం భోజనము అందించాలి

**వాంకిడి / ఆసిఫాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం భోజనము అందించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. బుధవారం వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ ఐ.ఎఫ్.ఎస్ అధికారి బార్గవ్ కుమార్ తో కలిసి ఆకస్మికంగా తనికి చేశారు. వంట గదిని పరిశీలించి విద్యార్థులకు మధ్యాహ్నం భోజనంలో ఏం వడ్డిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. వార్షిక పరీక్షలకు ఎలా సిద్ధం అవుతున్నారని పదో తరగతి విద్యార్థులను అడిగి పలు సలహాలు సూచనలు చేశారు. సరిపడా స్నానపు గదులు, టాయిలెట్స్ లేవని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకరాగ సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని హెచ్ఎం, ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం వాంకిడి మండల కేంద్రంలోని నూతన అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి బాలింతలు, గర్భిణీలకు సరైన పౌష్టికాహారం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ పరిసరాలను పరిశీలించి. బాలింతలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పిహెచ్సిలో సరిపడా వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రేషన్ షాపును తనిఖీ చేసి, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. మిగతా 2లో..



## మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

- మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



2వ సాధారణ మున్సిపాలిటీ/మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 11వ తేదీన జరుగనున్న పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో పిఓ, ఎపిఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపాలిటీ/మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో భాగంగా పోలింగ్ ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 ఓటర్లకు మించకుండా పోలింగ్ జరిగేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో కేటాయించబడిన సిబ్బందికి పోలింగ్ ప్రక్రియలోని ప్రతి అంశం తెలిసి ఉండాలని, ఓటింగ్ కంపార్ట్మెంట్ గోప్యత నిర్వహణ సక్రమంగా చేయాలని తెలిపారు. ఇతరులకు బదులుగా ఓటు వేయడం, ఒకటికి మించి ఓటు వేయడం మిగతా 2లో..

## పాఠశాల గడప దాటి విజ్ఞాన అన్వేషణ

- కరీంనగర్ డైరీ పాల కేంద్రం, జింకల పార్కును సందర్శించిన పెంచికల్ పేట్ విద్యార్థులు

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త :**




పెంచికల్ పేట్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజ్ఞాన యాత్రలో భాగంగా బుధవారం కరీంనగర్ జిల్లాలోని ప్రముఖ కరీంనగర్ డైరీ పాల కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాల శుద్ధి (ప్యూరిఫికేషన్) ప్రక్రియ, పాల నుంచి వివిధ పాల ఉత్పత్తులు తయారయ్యే విధానం, ఆధునిక యంత్రాల పనితీరు గురించి డైరీ సిబ్బంది విద్యార్థులకు ప్రత్యేక్షంగా వివరించారు. పాల ఉత్పత్తుల తయారీలో పరిశుభ్రత, నాణ్యత నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను విద్యార్థులు ఆసక్తిగా వీక్షి ంచారు ఈ సందర్శన ద్వారా ఆహార భద్రత, సాంకేతిక పరిజ్ఞానంపై వారికి అవగహన పెరిగిందని ఉపాధ్యాయులు తెలిపారు. అనంతరం విద్యార్థులు కరీంనగర్ జింకల పార్కును సందర్శించారు. అక్కడ వివిధ రకాల జంతువులను దగ్గరగా వీక్షి ంచడంతో పాటు, ప్రకృతి పరిరక్షణ, జంతు సంరక్షణ ఎంత ముఖ్యమో నేర్చుకున్నారు. పార్క్ పరిసరాల శుభ్రత, పర్యావరణ సమతుల్యతపై అవగహన పొందిన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయ నిర్మల, ఉపాధ్యాయులు యాదగిరి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## బల్దియా పోరులో 107 మంది అభ్యర్థుల

(మొదటిపేజీ తరువాయి)

నాకు బీఫాం వస్తుందని కొండంత ఆశతో పోటీ చేసిన ఆశావహులకు మొండిచేయి మిగిలింది. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసినా నమ్ముకున్న పార్టీ మాకు ద్రోహం చేసిందని ఇతర పార్టీలో చేరి టికెట్ సంపాదించుకున్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ భర్త రామ్ లాల్ గిల్డా బీఆర్ఎస్‌ను వీడి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థంపుచ్చుకున్నారు. ఉపసంహరణ రోజే ఇలా ఉంటే ఎన్నికలు ముగిసే నాటికి జంప్ జిలానీల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు పట్టణ ప్రజలు మాట్లాడుకుంటున్నారు.

## మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)




జరగకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని, పోలింగ్ ముగిశాక తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన నియమాలపై శిక్షణలో తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ అధికారులకు కేంద్రాలలో త్రాగునీరు, మూత్రశాలలు, లైటింగ్, ఫ్యాన్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, గర్భిణీ స్త్రీలు, బాలింతలు మినహాయింపు కోరినట్లయితే ఆమోదించడం జరుగుతుందని, మిగతా వారికి అత్యవసర ఆరోగ్య పరిస్థితులు, ఇతర ఇబ్బందులు తలెత్తితే తప్ప పోలింగ్ విధులలో మినహాయింపు ఉండదని తెలిపారు. 11వ తేదీన పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, 12 రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్ అన్వేష్, మాస్టర్ ట్రైనర్ హరిప్రసాద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం భోజనము అందించాలి

(మొదటిపేజీ తరువాయి)

రేషన్ కార్డు దారులకు సకాలంలో సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం మండలంలోని గణేష్ పూర్ గ్రామములో కొనసాగుతున్న ఉపాది హామీ పనులను డిఆర్డిఓ తో కలిసి పరిశీలించారు. ఉపాధి హామీ కూలీల మస్టర్ రోల్స్ ను తనిఖీ చేసి ఎన్ని రోజులు పనులు కల్పిస్తున్నారని, కూలీలకు అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండలాభివృద్ధి అధికారి జ్యోతి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ వ్యాధి నివారణకు అధికారులు సమన్వయంతో పని చేయాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**

క్యాన్సర్ వ్యాధి నివారణకు వైద్య, ఆరోగ్య శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సంపూర్ణత అభియాన్ 2.0 లో భాగంగా ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, శిక్షణ ఐ ఎఫ్ ఎస్ అధికారి భార్గవ్ కుమార్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్యాన్సర్ వ్యాధి విస్తరించకుండా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది సమన్వయంతో క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. క్యాన్సర్, క్షయ వంటి రోగాలను ప్రాథమిక దశలలో గుర్తించి తగిన చికిత్సలు అందించినట్లయితే తొలి దశలోని నిర్మూలించవచ్చని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. క్యాన్సర్ వ్యాధిలో ఎన్నో రకాలు ఉన్నాయని, వ్యాధుల పట్ల ఎలాంటి భయం ఉండకూడదని, జిల్లాలో 128 కేసులు ఉన్నాయని, వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, శిక్షణ ఐ ఎఫ్ ఎస్ అధికారి భార్గవ్ కుమార్ లతో కలిసి బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అధికారులు, సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాలలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వెదజల్లే పద్ధతిలో వరి పంట సాగు

**దహెగాం, ఫిబ్రవరి 4,ప్రభాతవార్త :**

దహెగాం మండలంలోని ఖర్జీ గ్రామనికి చెందిన రైతు తన పొలంలో నేరుగా వెదజల్లే పద్ధతిలో వరి పంట ను సాగు చేస్తున్నాడు. బుధవారం నాడు ఏ ఈ వో సుష్మిత వరి పంట ను సందర్శించారు. రైతు ను వివరాలు అడగగా వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేస్తే కూలీల కొరత తగ్గుతుందని, పంట లో అధిక లాభం పొందవచ్చని తెలిపారు. కూలీల కొరత వలన ఈ పద్ధతిని ఎంచుకున్నానని రైతు తెలిపారు.



## ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీఓ

**బెజ్జూర్,ఫిబ్రవరి 4,ప్రభాత వార్త:**

బెజ్జూర్ మండలంలోని మర్తిడి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్,ఏపీఓ రాజన్న ఆకస్మికంగా వెళ్లి పరిశీలించారు.ఈ సందర్భంగా కూలీలు నిబంధనలకు అనుగుణంగా పనిచేసి రోజు కూలి 307 రూపాయలు పొందాలని సూచించారు.పనిని ఇచ్చిన కొలతల ప్రకారం పూర్తి చేయాలని,అలా చేయనట్లయితే కూలి డబ్బులు తక్కువ వచ్చే అవకాశం ఉందని తెలిపారు.అంతంతరం మర్తిడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కిచెన్ షెడ్డుకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వారి వెంట సర్పంచ్ మల్లేష్,టిఏ విజయ్ ఉన్నారు.



### చెరువులను చిత్తడి నేలగా

## గుర్తించిన వాటిని రక్షించాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**

చెరువులను చిత్తడి నేలగా గుర్తించిన వాటిని రక్షి ంచాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో చెరువులను చిత్తడి నేలల గుర్తింపుపై జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, కాగజ్ నగర్ డివిజన్ అటవీ అధికారి అప్పయ్య, ట్రైనీ ఐ ఎఫ్ ఎస్ భార్గవ్ కుమార్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెంచికల్ పేట మండలంలోని ఎల్లూరు చెరువును చిత్తడి నేలగా గుర్తించడం జరిగిందని, తద్వారా చెరువులు ఆక్రమణకు గురి కాకుండా కట్టడి చేయడం జరిగిందని తెలిపారు. చెరువును అభివృద్ధి చేసి నీటి సామర్థ్యం పెంచడం ద్వారా రైతులకు సాగు నీరు అందించవచ్చని, పశువులకు త్రాగునీరు అందుబాటులో ఉంటుందని, రకరకాల పక్షులు వలస రావడం ద్వారా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. తిర్యాణి మండలంలోని చెలిమెల ప్రాజెక్టును చిత్తడి నేలగా గుర్తించి అవసరమైన అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివరావు, నీటిపారుదల శాఖ ఈఈ లు గుణవంతరావు, ప్రభాకర్, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.



### మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సిబ్బంది

## రెండవ రాండమైజేషన్ పూర్తి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :**

రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బంది రెండవ రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఎన్నికల సాధారణ పరిశీలకులు అలోక్ కుమార్, అదనపు కలెక్టర్ డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, శిక్షణ ఐ ఎఫ్ ఎస్ అధికారి భార్గవ్ కుమార్ లతో కలిసి ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ ఎన్నికల కొరకు పోలింగ్ సిబ్బంది రెండవ రాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో 20 వార్డులు, కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలోని 30 వార్డులకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, ఈ క్రమంలో ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి 20 శాతం అదనపు సిబ్బందితో కలిపి 41 మంది పోలింగ్ అధికారులు, 39 మంది సహాయ పోలింగ్ అధికారులు, 80 మంది ఇతర పోలింగ్ అధికారులను కేటాయించడం జరిగిందని తెలిపారు. కాగజ్ నగర్ మున్సిపాలిటీకి 20 శాతం అదనపు సిబ్బందితో కలిపి 106 మంది పోలింగ్ అధికారులు, 112 మంది సహాయ పోలింగ్ అధికారులు, 209 మంది ఇతర పోలింగ్ అధికారులను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 11వ తేదీన జరగనున్న పోలింగ్ ప్రక్రియ కొరకు అధికారుల రెండవ రాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించడం జరిగిందని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, ఎన్ఐసి సిబ్బంది పాల్గొన్నారు.

## క్యాన్సర్ వ్యాధి పై ప్రజలకు అవగాహన కార్యక్రమం

జన్నారం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త



ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా జన్నారం ప్రభుత్వ వైద్యులు ఉమాశ్రీ ఆదేశాల మేరకు తపాలపూర్ గ్రామంలో క్యాన్సర్ వ్యాధి పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి మనిషి తమ రోజువారీ అలవాట్లలో మార్పులు చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, క్యాన్సర్ బారిన పడకుండా మన ఆహారపు అలవాట్లను, ధూమపానం, మద్యపానం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండటం శ్రేయస్కరం అని సూచించారు. ఎన్సిడి కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ వ్యాధిని ముందస్తుగా గుర్తించడం జరుగుతుందని, పద్నాలుగు ఏళ్ల వయసు విద్యార్థులకు హెచ్‌పివి వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని, అలాగే మహిళలు మామోగ్రఫీ, పాప్ స్మియర్ పరీక్షలు చేయించుకోవాలని అవగాహన కల్పించారు. మన దైనందిన కార్యక్రమాల్లో ఖచ్చితంగా మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్, ఏఎన్ఎం మాధవి, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఆశా కార్యకర్తలు లలిత, విజయ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గెలుపొందిన ప్రజా ప్రతినిధులకు సన్మానం

జన్నారం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త

జన్నారం మండలంలోని 29 గ్రామ పంచాయతీలలో గెలుపొందిన మాల కుల సంఘం ప్రజాప్రతినిధులకు జ్యోతి గార్డెన్‌లో మాలమహానాడు జన్నారం మండల శాఖ తరపున పూలమాలలు వేసి, శాలువాలు కప్పి బుధవారం నాడు ఘనంగా ఆత్మీయ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షులు దాముక కరుణాకర్ మాట్లాడుతూ మాలలంతా ఐక్యంగా ఉండాలని, మాల ప్రజా ప్రతినిధులు అంతా నిస్వార్థంగా సేవ చేయాలని, తమకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నప్పుడే నిజమైన గౌరవం సమాజంలో ఉంటుందని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చూపినటువంటి సేవా మార్గంలో ప్రజా ప్రతినిధులందరూ నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాదం పెళ్లి సర్పంచ్ సామల విజయలక్ష్మి లక్ష్మీరాజ్యం, కిష్టాపూర్ ఉపసర్పంచ్ కోలాదేవపాల, కలమడుగు ఉపసర్పంచ్ పాత లింగన్న, వివిధ గ్రామాల వార్డు మెంబర్లు, మాల మహానాడు, రాష్ట్ర, జిల్లా, మండల, నాయకులు, బొట్ల సంజీవ్, కోడి ఇసాక్, ప్రధాన కార్యదర్శి కండ్లే శ్రావణ్, భరత్ కుమార్, రాజయ్య, అలుగునూర్ పద్మారావు, మగ్గిడి తిరుపతి, పిట్ట రాజారావు, అక్కవతల దేవయ్య, పాత బాలరాజు, మేకల మాణిక్యం, గద్దల పవన్, అల్లాటి రాజన్న బత్తుల ప్రకాష్, మాల మహానాడు యువజన అధ్యక్షులు శరత్, యువకులు మంత్రి రాజు, అజయ్, సుధాకర్, లడ్డు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలతోనే రైతులకు మేలు

### రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యత్వానికి స్వాగతం

- ప్యాక్స్ సెక్రటరీ రాజు నాయక్

వేమనపల్లి, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త

రైతులు ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఎంతగానో దోహదపడతాయని వేమనపల్లి మండల ప్యాక్స్ సెక్రటరీ రాజు నాయక్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఎఫ్‌పిఒ ద్వారా రైతులకు చేకూరే ప్రయోజనాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈఎఫ్‌పిఒలో చేరేందుకు సభ్యత్వ ఫీజు రూ.2000 కాగా, ప్రతి సభ్యుడు ఈక్విటీ గ్రాండ్ కింద రూ.2000 జమ చేయాల్సి ఉంటుంది. సభ్యులుగా చేరిన రైతులకు భవిష్యత్తులో ప్రభుత్వం అందించే పథకాలు, ఋణ సౌకర్యాలు, మార్కెటింగ్ సహాయం, శిక్షణ కార్యక్రమాలు లభించనున్నట్లు తెలిపారు. కావున అర్హత ఉన్న రైతులందరూ రైతు ఉత్పత్తిదారుల సంఘంలో పాత సభ్యులు చేరి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చివరి తేదీ 10022026 కావలసిన పత్రాలు పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, ఫోన్ నెంబర్, నామిని ఆధార్ కార్డు, సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు 6281939233, 9491396732.

# స్వయం ఉపాధితోనే మహిళల ఆర్థిక స్వావలంబన: డీజీఎం అనిల్ కుమార్

### - వృత్తి శిక్షణ తరగతుల పరిశీలన

నస్పూర్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త



మహిళలు వివిధ రకాల వృత్తి శిక్షణ కోర్సుల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించి ఇతరులకు మార్గదర్శకులుగా నిలవాలని శ్రీరాంపూర్ డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్ అన్నారు. బుధవారం నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయ్‌లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైలరింగ్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్ తరగతులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. శ్రీరాంపూర్ ఏరియాలో సుమారు 555 మంది మహిళలు వివిధ రకాల వృత్తి శిక్షణ కోర్సులను నేర్చుకుంటున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. శిక్షణ పొందుతున్న మహిళలు తరగతులకు విధిగా హాజరు కావాలని అనిల్ కుమార్ సూచించారు. ఫ్యాకల్టీ వద్ద ఉన్న నైపుణ్యాలను నేర్చుకుని స్వయం ఉపాధి వైపు ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలి. సమాజంలో ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలు భవిష్యత్తులో ఆర్థిక ఎదుగుదలకు తోడ్పడతాయని తెలిపారు. శిక్షణ కేంద్రంలోని హాజరు రిజిస్టర్లను అనిల్ కుమార్ తనిఖీ చేశారు. మహిళల హాజరు శాతం, వారి పురోగతి వివరాలను శిక్షకులను అడిగి తెలుసుకున్నారు. శిక్షణార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సేవా సమితి అధికారి, సీనియర్ పీవో సురేందర్ పాల్గొన్నారు.

# బ్యాలెట్ పేపర్ల ముద్రణలో అప్రమత్తంగా వ్యవహరించాలి

### - మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల,ఫిబ్రవరి 4, ప్రభాతవార్త



2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా బ్యాలెట్ పేపర్ల ముద్రణలో అప్రమత్తంగా వ్యవహరించాలని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో బ్యాలెట్ పేపర్ల ముద్రణ కొరకు ఎంపిక చేసిన శారద ప్రింటింగ్ ప్రెస్‌ను కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్‌తో కలిసి ఆకస్మికంగా సందర్శించి ముద్రణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ప్రక్రియ ముగిసిందని, నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అర్హత గల అభ్యర్థులకు నిబంధనల ప్రకారం ఎన్నికల గుర్తులు కేటాయించడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో 240 మంది, బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులలో 173 మంది, చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 18 వార్డులలో 107 మంది, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 22 వార్డులలో 113 మంది, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 15 వార్డులలో 60 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారని తెలిపారు. జిల్లాలోని 1 మున్సిపల్ కార్పొరేషన్, 4 మున్సిపాలిటీలలో మొత్తం 693 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం గుర్తులు కేటాయించడం జరిగిందని, ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యం బ్యాలెట్ పేపర్ల ముద్రణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



బెల్లంపల్లి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త

ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్టపరిచేందుకు చేపట్టిన చర్యలలో భాగంగా బెల్లంపల్లి పట్టణంలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి పట్టణంలో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా అనేక చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా 25 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో 200 కోట్ల రూపాయల వ్యయంతో పాఠశాల నిర్మాణానికి చర్యలు చేపట్టిందని తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాల పరిధిలో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించి వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం జరుగుతుందని తెలిపారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## అంగన్వాడి సెంటర్‌లో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త

మండలంలోని హనుమంతుపల్లి అంగన్వాడి సెంటర్‌లో బుధవారం తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సిడిపిఓ రేష్మ, ఏసిడిపిఓ ప్రియదర్శిక, వెంకట్రావు పేట సూపర్వైజర్ వాణి హాజరై అవగాహన కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల వెనుకబడిన తరగతుల కోసం ప్రభుత్వం అందించే సేవలను సద్వినియోగం చేసుకొని, సామాజిక సాధికారత సాధించే దిశగా అడుగులు వేయాలని, సమగ్ర అభివృద్ధి జరిగేటట్టు చూడాలని సూచించడం జరిగింది. అలాగే సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, కుల సర్వే లాంటి రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడం జరుగుతుందని చెప్పడం జరిగింది. అనంతరం సామాజిక వేడుకల్లో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, హనుమంతుపల్లి పంచాయతీ సెక్రటరీ, గర్భిణీలు, పిల్లలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అభ్యర్థులు సహకరించాలి: సీఐ రమేష్

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

క్యాతనపల్లి మున్సిపాలిటీలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అభ్యర్థులు సహకరించాలని మందమర్రి సీఐ రమేష్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో అభ్యర్థులతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రచార సమయంలో ఎలాంటి గొడవలు, అల్లర్లు జరపకూడదన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని,హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో క్యాతనపల్లి కమిషనర్ మారుతి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



## వేలాల జాతర, గోదావరి పరిసర ప్రాంతాలను పరిశీలించిన అధికారులు

**జైపూర్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వేలాలలో జరిగే మల్లికార్జున స్వామి జాతరకు సంబంధించి చేస్తున్న పనులు, గోదావరి నది వద్ద, గుడి వద్ద గుట్ట మీద చేస్తున్న ఏర్పాట్లను మండల స్థాయి అధికారులు, సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు సకాలంలో పూర్తి చేయాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ, త్రాగునీరు, తాత్కాలిక టాయిలెట్స్ ఏర్పాట్లు తదితర ఏర్పాట్లు చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డేగ స్వప్న నగేష్, తహశీల్దార్ వనజ, ఎంపీఓ శ్రీపతి బాపు,ఎస్.ఐ రాజశేఖర్, ఉప సర్పంచ్ సుందిళ్ల రాయలింగు, ఆలయ ఈ.ఓ. రమేష్, పంచాయతీ కార్యదర్శి ఎస్.రాకేష్, వార్డు సభ్యులు, ఎస్.టి.పి.పి నరసింహులు, పర్సనల్ డీ.జి.ఎం కిరణ్, ఇతర సింగరేణి అధికారులు గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



## కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిందేమిటి?

### అధికారంలోకి వచ్చి రెండెండ్లైనా ఆరు గ్యారంటీల అమలేది

### మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శ

**చెన్నూరు టౌన్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

అరుగ్యారంటీల పేరుచెప్పుకొని అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాలిటీలో బుధవారం మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ముందుగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి రెండేండ్లు గడిచాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, ఇంటింటికి వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఆరుగ్యారంటీల పేరు చెప్పుకోవడానికి తప్ప వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అభ్యర్థులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# గుర్తింపు సంఘం ఎన్నికల హామీల అమలుకు కృషి

- 12న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య

**నస్పూర్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు, వేజ్ బోర్డు శాశ్వత సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో నిర్వహించిన గేట్ మీటింగ్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన సీహెచ్‌పీ కమిటీ నాయకులను ఈ సందర్భంగా కార్మికులకు, యాజమాన్యానికి పరిచయం చేశారు. సీహెచ్‌పీలోని పీ2, పీ3 క్రషర్ల వద్ద ఏసీలు సరిగా పనిచేయకపోవడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని సీతారామయ్య పేర్కొన్నారు. వాటిని వెంటనే బాగు చేయడంతో పాటు ఫ్యాబ్రికేషన్ షెడ్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. క్యాంటీన్‌లో మెరుగైన వసతులు కల్పించాలని, నాణ్యమైన అల్పాహారం అందించేలా తగిన మెటీరియల్ అందుబాటులో ఉంచాలని కోరారు. కార్మికులు ఎదుర్కొంటున్న ఈ సమస్యలను ఇప్పటికే యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లామని, వారు సానుకూలంగా స్పందించి తక్షణ పరిష్కారానికి హామీ ఇచ్చారని వెల్లడించారు. కొత్తగా ఎన్నికైన ఫిట్ కమిటీ సమిష్టిగా పనిచేస్తూ కార్మిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సీతారామయ్య మండిపడ్డారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో 4 లేబర్ కోడ్‌లను తీసుకురావడాన్ని నిరసిస్తూ ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదా పాల్గొన్నారు. ఫిట్ కార్యదర్శులు గుడిగంటి నర్సింగరావు, జిల్లాల రవి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, పిట్ నాయకులు సాయి రాజు, అశోక రెడ్డి, శ్రీనివాస్, గజ్జి రమేష్, మావో, జనగామ నారాయణ, కల్లేపల్లి శ్రీనివాస్, జోగుల ప్రభాకర్, కలమడుగు లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## వెదురు ఉత్పత్తులతో ఆదివాసీలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

**జన్నారం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

వెదురు ఉత్పత్తులతో ఆదివాసీలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని జన్నారం అటవీ డివిజనల్ అధికారి రామ్ మోహన్ సూచించారు. మంచిర్యాల జిల్లా, జన్నారం మండలం ఇంధనపల్లి గ్రామంలో శిక్షణ పొందిన ఆదివాసులకు అటవీ శాఖ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన వెదురు ఉత్పత్తులు, శిక్షణ కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుతున్న సమాజానికి అనుగుణంగా తక్కువ ముడి సరుకుతో ఎక్కువ ధర వచ్చే కళాకృతులు తయారు చేస్తే మార్కెటింగ్ అవకాశాలు ఉన్నాయని సూచించారు. ఆసక్తితో కేంద్రాన్ని నిర్వహించుకునే వారికి తమ శాఖ సహాయం ఎల్లవేళలా ఉంటుందని చెప్పారు. ఇంధనపల్లి రేంజి అధికారి జి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వెదురు ఉత్పత్తుల కేంద్ర నిర్వహణకు తాము ఎల్లప్పుడూ సహకరిస్తామని చెప్పారు. అటవీ రక్షణతో పాటు ఇలాంటి పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. శిక్షణ కేంద్ర నిర్వహణకు తోడ్పడిన ఈడిఐఐ, హైటికాస్ స్వచ్ఛంద సంస్థలను ఆయన అభినందించారు. ఈడిఐఐ ప్రాజెక్ట్ మేనేజర్ భూక్యా దేవేందర్ నాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల మహిళలు నిర్వహించుకునే కుటీర పరిశ్రమలకు తమ సంస్థ పూర్తిగా తోడ్పాటు ఉంటుందని చెప్పారు. నాణ్యతగా వస్తువులను తయారు చేస్తే మార్కెటింగ్ కల్పిస్తామని అన్నారు. హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ బాపురెడ్డి మాట్లాడుతూ అటవీ రక్షణతో పాటు తమ సంస్థ జీవనోపాదులను గుర్తించి గ్రామీణా ఆదివాసుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆర్వీజీ సంస్థ రాష్ట్ర కో ఆర్డినేటర్ రవికుమార్ మాట్లాడుతూ వెదురు గడలతో నైపుణ్యంగా తయారు చేసిన వస్తువులు బాగున్నాయని, కేంద్ర అభివృద్ధికి నిధులను మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని అన్నారు. స్వచ్ఛంద సంస్థల కన్సల్టెంట్ చంద్రమోహన్ మాట్లాడుతూ వర్క్ షాప్‌లో తయారుచేసే వస్తువులు నాణ్యతగా ఉంటే మార్కెట్లో ఎక్కువ ధర వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. హైటికాస్ ఉత్తర తెలంగాణ ప్రాంతీయ కో ఆర్డినేటర్ డాక్టర్.ఎనగందుల వెంకట్ మాట్లాడుతూ ఎలాంటి వ్యవసాయ భూములు లేని ఆదివాసి నాయకపోడు వర్గాన్ని తమ సంస్థ సర్వేలో వారి ఆర్థిక పరిస్థితులను గుర్తించి వెదురు ఉత్పత్తులపై శిక్షణను ఇప్పించినట్లు ఆయన చెప్పారు. ఇలాంటి పనులు చేస్తూ సమాజంలో నూతన ఒరవడిలో జీవన విధానంలోకి మారాలని సూచించారు. శిక్షణ, ఉత్పత్తి కోసం సహకరించిన అటవీశాఖ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రెండు నెలల పాటు నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న మహిళలకు ధ్రువపత్రాలను అందజేశారు.



## పజల సహకారంతోనే టీబీ రహిత సమాజం సాధ్యం

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

ప్రజలందరి సహకారంతో త్వరలోనే టీబీ రహిత భారతదేశం దిశగా ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని వెంకట్రావు పేట వైద్యాధికారి డాక్టర్ సతీష్ కుమార్ అన్నారు. బుధవారం నాడు చందారం గ్రామంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్షెట్టిపేట మండలంలోని కొత్తూర్ గ్రామాన్ని టీబీ రహిత గ్రామంగా ప్రకటించడం జరిగిందని తెలిపారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా రెండో విడత కార్యక్రమంలో అనుమానితులందరికీ పోర్టబుల్ మొబైల్ ఎక్స్‌రే ద్వారా ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించి టీబీ నిర్ధారణ చేసినట్లు తెలిపారు.గత మూడు రోజుల నుండి కొత్తూర్, దౌడెపల్లి, తిమ్మాపూర్ గ్రామాలలో క్యాంపులు నిర్వహించి 265 మందికి ఎక్స్ రే పరీక్షలు, 80 మందికి తెమడ పరీక్షలు, 200 మందికి షుగర్, బీపితో పాటు సాధారణ పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు డాక్టర్ సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సూపర్ వైజర్లు శోభ, టీబీ సూపర్ వైజర్ సురేష్, ఎంఎల్‌హెచ్ పిలు సుమలత, అక్షయ, హెల్త్ అసిస్టెంట్లు గఫూర్, ఇసాక్ అహ్మద్, ఏఎన్ఎం యేసు వర, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



## గుడుంబా విక్రయదారుల బైండోవర్

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరు మహిళలు ,బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఒక మహిళను బుధవారం మందమర్రి తహశీల్దార్ వద్ద బైండోవర్ బైండోవర్ చేసినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మద్యం అమ్ముతున్న, బెల్ట్ షాప్‌లు నిర్వహించిన చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కాంగ్రెస్ కన్వీనర్‌గా పాండురంగ్

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త:



బజార్‌హత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్‌గా జల్కె పాండురంగ్ వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండల కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషిని గుర్తించి సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా పాండురంగ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన అధిష్ఠానానికి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకెళ్తానని పేర్కొన్నారు.

## వాహనదారులు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలి: ఏఎస్ఐ బలిరామ్



సిరికొండ, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త:

వాహనదారులు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని ఏఎస్ఐ బలిరామ్ అన్నారు. మండల కేంద్రంలోని ఇచ్చోడ రోడ్డు వద్ద బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ బలిరామ్ మాట్లాడుతూ వాహనదారులు వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే యజమానులపై చర్యలు తీసుకుంటామని, నంబర్ ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలాన్లను వెంటనే చెల్లించాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సారంగాపూర్ మండల ప్రైవేట్ మెడికల్ నూతన కార్యవర్గం ఎన్నిక



సారంగాపూర్, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త:

సారంగాపూర్ మండల ప్రైవేట్ మెడికల్ షాపుల నిర్వాహకుల అసోసియేషన్ (కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్) 2026 సంవత్సరానికి గాను బుధవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. నూతన అధ్యక్షుడిగా కొత్తపల్లి గంగాధర్, ఉపాధ్యక్షుడిగా దాసరి మల్లేష్, గౌరవ అధ్యక్షుడిగా దండు సాయన్న, ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి విలాజి, కోశాధికారిగా పాల్దే గణేష్, సంయుక్త కార్యదర్శిగా రామోజీ రాజేంద్రప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా ఎం. సత్యనారాయణ, రాజవర్ధన్ రెడ్డి, దొంత్తుల చంద్రశేఖర్, శ్రీరామోజీ సాయన్న ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ మెడికల్ షాపుల నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యాపార నిర్వహణకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం అందాలి

### సామాజిక న్యాయ దినోత్సవంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త:

సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు, హక్కులు అందేలా సామాజిక న్యాయం చేరాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సామాజిక న్యాయ దినోత్సవం (సోషల్ జస్టిస్ డే)ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి కలెక్టర్ సామాజిక న్యాయ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే హక్కులు, బాధ్యతలు, సామాజిక న్యాయం వంటి అంశాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సమాజంలోని బలహీన వర్గాలకు మాత్రమే కాకుండా, ప్రతి పౌరుడికి సమ న్యాయం అందే విధంగా వ్యవస్థ పనిచేయాలన్నారు. సామాజిక న్యాయం అనేది ప్రభుత్వ పరిరక్షణ మాత్రమే కాకుండా, ప్రతి పౌరుడి మౌలిక హక్కు అని పేర్కొన్నారు. సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ఉపన్యాసాలు ఇవ్వగా, పలు పోటీలు నిర్వహించారు. వాటిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్, అధికారులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వసతిగృహాల్లో సౌకర్యాల పర్యవేక్షణకు రూపొందించిన ప్రత్యేక మొబైల్ యాప్‌పై కలెక్టర్ అధికారులకు వివరించారు. తహసీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులు వసతిగృహాలను సందర్శించినప్పుడు అక్కడి సదుపాయాల వివరాలను ఫోటోలతో సహా యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ యాప్ ద్వారా వసతిగృహాల సమగ్ర సమాచారం సులభంగా సేకరించడంతో పాటు, సదుపాయాల మెరుగుదలకు తోడ్పడుతుందని తెలిపారు. ప్రస్తుతం ఈ యాప్‌ను జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నామని, ఇది విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే అవకాశం ఉందన్నారు. యాప్ వినియోగంలో ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా లేదా సూచనలు ఉన్నా వెంటనే తెలియజేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు ఎరువుల వినియోగంపై అవగాహన



బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త:

బజార్‌హత్నూర్ మండలంలోని బలన్‌పూర్ గ్రామంలో రైతులకు ఎరువుల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ బోట్ల సతీష్ మాట్లాడుతూ పంటలకు అవసరమైన మోతాదులోనే ఎరువులు వాడాలని సూచించారు. అధికంగా ఎరువులు వాడటం వల్ల భూసారం తగ్గడమే కాకుండా దిగుబడి కూడా దెబ్బతింటుందని వివరించారు. యూరియా త్వరగా కరిగే స్వభావం కలిగి ఉంటుందని, ఫాస్ఫరస్ వాడకంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులు వాడితే ఖర్చులు తగ్గి లాభాలు వస్తాయని పేర్కొన్నారు. అనంతరం ఆయన సామాజిక అంశాలపై మాట్లాడుతూ చిన్న పిల్లలను పనులకు తీసుకెళ్లకుండా బడికి పంపాలని, విద్యతోనే అభివృద్ధి సాధ్యమని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ ఆఫీసర్ నిఖిత, పీ మేనేజర్ వంశీ, ఫ్రెండ్స్ పిల్ ఫెసిలిటేటర్ రాథోడ్ స్వప్న, సాయి తదితరులు పాల్గొని రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఇలాంటి సదస్సులు మరిన్ని నిర్వహించాలని రైతులు కోరారు.

## తెలంగాణ సోషల్ జస్టిస్ డే వేడుకలు



ఆదిలాబాద్, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త:

ఆదిలాబాద్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (పురుషులు)లో తెలంగాణ సోషల్ జస్టిస్ (సామాజిక న్యాయ) అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపల్ లెఫ్టినెంట్ పుట్టా లక్ష్మణ్ మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమన్యాయం, సామాజిక సాధికారతే లక్ష్యంగా వందేళ్ల తర్వాత సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ పరమైన కుల గణన చేపట్టడం, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణకు పరిష్కారం చూపడం వంటి ఉద్దేశంతో ఫిబ్రవరి 4న సామాజిక న్యాయ దినోత్సవంగా ప్రకటించడం హర్షించదగ్గ విషయమని ఆయన పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలు, దళితులు, గిరిజనులు, మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం ముందడుగు వేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె. సునీల్, ఎస్ రామకృష్ణ, లక్ష్మీ, ప్రసన్న, శిరీష, శ్రీలత, ప్రీతం రాజు, గణేష్, శ్రీనివాస్, జితేందర్, ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## గిరిజన డిగ్రీ కళాశాలలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం




ఆదిలాబాద్, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త:

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపల్ లెఫ్టినెంట్ పుట్టా లక్ష్మణ్ తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులతో కలిసి క్యాన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మోటివేషనల్ స్పీకర్ ఘన రాజ్ మాట్లాడుతూ విద్యార్థుల ఆనంద స్థాయిలను పరిశీలించిన ఆయన, సానుకూల ఆలోచనలు, మానసిక బలంతోనే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి క్యాన్సర్ పట్ల సమాజానికి అవగాహన కల్పించే దూతగా మారాలని పిలుపునిచ్చారు. క్యాన్సర్ పట్ల భయం వీడి, ముందస్తు జాగ్రత్తలు, సరైన జీవనశైలి పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల సిబ్బంది కేటాయింపు



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త:**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బంది కేటాయింపు ప్రక్రియను చేపట్టారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎన్నికల సాధారణ పరిశీలకుడు హనుమంత్ నాయక్ సమక్షంలో రెండో విడత ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందిని పారదర్శకంగా వివిధ వార్డులకు కేటాయించేందుకు కంప్యూటర్ ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, నోడల్ అధికారులు ఫణిందర్, రవి కుమార్ మరియు ఇతర మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

**ఆదిలాబాద్‌లో ప్రత్యేక ఫెసిలిటేషన్ కేంద్రం**

**ఈనెల 6-8 తేదీల్లో అవకాశం**

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజార్షి షా**

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త:**



మున్సిపల్ ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అధికారులు, ఉద్యోగుల సౌకర్యార్థం పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజార్షి షా బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు. పోలింగ్ రోజున డ్యూటీ కారణంగా ఓటు వేయలేని సిబ్బంది ముందస్తుగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు మూడు రోజుల పాటు పనిచేస్తుందని తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది ఈ అవకాశాన్ని వినియోగించుకొని పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయదలిచిన ఉద్యోగులు తమ వెంట ఎన్నికల డ్యూటీ ఆర్డర్, ఓటరు గుర్తింపు కార్డు (ఇపిఐసి), ఫారం12 తీసుకురావాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి సందేహాల నివృత్తి కోసం నోడల్ అధికారి ఎ. ఫణీందర్ రావు ఫోన్: 8106517561 ను సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు.

## ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన



**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త:**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఓ ఆల్బర్ట్ అన్నారు. బుధవారం ఎల్లూర్ గ్రామంలో సర్పంచ్ చప్పిడి రవీందర్ తో కలిసి ఇంటి నిర్మాణాలు పరిశీలించి, నిర్మాణాలు గడువులోగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. నిర్మాణం ఇప్పటికి ప్రారంభించాని ఇండ్లను జాబితా నుండి తొలగిస్తామని తెలిపారు. ఈ సందర్శనలో ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి చంద్రయ్య పలువురు పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘన: సిఆర్‌పి సేవల నిలిపివేత

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త:**



ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు భీంపూర్ మండలం పిప్పల్‌కోటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సిఆర్‌పి)గా పనిచేస్తున్న పి రవీందర్‌ను విధుల నుండి తొలగిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ రాజేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. మండల విద్యాశాఖాధికారి సమర్పించిన నివేదిక ప్రకారం, సదరు ఉద్యోగి ఒక రాజకీయ పార్టీలో చేరడమే కాకుండా ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నట్లు నిర్ధారణ అయిందని, ఈ విషయంపై దినపత్రికల్లో వచ్చిన వార్తలు, విచారణలో బయటపడ్డ ఆధారాలను పరిగణనలోకి తీసుకుని ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సమగ్ర శిక్షణ తెలంగాణ ఉపాధి ఒప్పంద నిబంధనల ప్రకారం సిబ్బంది రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనరాదని స్పష్టం చేశారు. క్రమశిక్షణా ఉల్లంఘనకు సంబంధించి ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండానే సదరు ఉద్యోగిని తక్షణమే విధుల నుండి తొలగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పేర్కొన్నారు.

# తనిఖీల్లో భారీగా నగదు పట్టివేత



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త:**

మున్సిపల్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అధికారులు నిర్వహిస్తున్న తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం శివారులోని రాంపూర్ చెక్‌పోస్ట్ వద్ద బుధవారం మధ్యాహ్నం పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ. 28 లక్షల నగదు బయటపడింది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పొరుగు రాష్ట్రాల నుండి నగదు, మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు సరిహద్దుల వద్ద నిఘాను కట్టుదిట్టం చేశారు. ఈ క్రమంలో మహారాష్ట్ర నుండి వస్తున్న ఓ ఆర్టీసీ బస్సును రాంపూర్ చెక్‌పోస్ట్ వద్ద అధికారులు సోదా చేశారు. బస్సులో ప్రయాణిస్తున్న సుభాష్ కేశవ్ అనే వ్యక్తి బ్యాగును తనిఖీ చేయగా, అందులో రూ. 28 లక్షల నగదు లభ్యమైంది. సదరు నగదుకు సంబంధించి సుభాష్ కేశవ్ వద్ద ఎలాంటి సరైన పత్రాలు లేకపోవడంతో, ఎన్నికల నియమావళి ప్రకారం ఆ మొత్తాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న చెక్‌పోస్టుల వద్ద రెవెన్యూ, పోలీస్ సిబ్బంది 24 గంటల పాటు షిఫ్టుల వారీగా నిరంతర నిఘా కొనసాగిస్తున్నారని అధికారులు తెలిపారు. రూ. 50 వేల కంటే ఎక్కువ నగదును సరైన పత్రాలు లేకుండా తరలిస్తే సీజ్ చేస్తామని, ప్రజలు ప్రయాణాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఈ తనిఖీలో డిఎస్పీ జీవన్ రెడ్డి, రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



**ఇచ్చోడ, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త:**

ఫిబ్రవరి 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటియూసి మరియు కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా ఇచ్చోడలో జరిగిన సమావేశంలో ఏఐటియూసి రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక 04 కోడ్లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం ..26,000 చెల్లించాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం మరియు ఆశా కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే భవన నిర్మాణ కార్మికులకు నెలకు ..5,000 పెన్షన్ అందించాలని పేర్కొన్నారు. ఏఐటియూసి జిల్లా అధ్యక్షుడు బి. గోవర్ధన్ మాట్లాడుతూ.. బీడీ పరిశ్రమపై విధిస్తున్న జీఎస్టీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 12 సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు, ఇచ్చోడ మండల కార్యదర్శి కల్లేవల్లి గంగయ్య, మండల అధ్యక్షుడు వెంకటేష్, బి.ఓ.సి మండల అధ్యక్షుడు రవి, రాజ్ కుమార్, అశోక్ పాల్గొన్నారు.

## అభివృద్ధి కోసం అనితను గెలిపించాలి



**కాగజ్‌నగర్, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త:**

అభివృద్ధి కోసం అనితను గెలిపించాలని కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని 29వ వార్డు ఓల్డ్ కాలనీలో బీజేపీ అభ్యర్థి డాక్టర్ కొత్తపల్లి అనిత తరఫున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచారంలో కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి అనితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. వార్డు సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే విద్యావంతురాలు, సేవా దృక్పథం ఉన్న అనితను గెలిపించుకోవాలని సూచించారు. వార్డులోని డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, తాగునీటి సమస్య పరిష్కారం మరియు మౌలిక సదుపాయాల కల్పనే బీజేపీ లక్ష్యమని పేర్కొన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికీ చేరాలంటే స్థానికంగా బీజేపీ అభ్యర్థుల గెలుపు అవసరమని వివరించారు. మాట ఇచ్చే నాయకుల కంటే మార్పు తెచ్చే నాయకులను ఎంచుకోవాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచారంలో షేక్ చంద్, ఖాదర్ ఖాన్, రావుఫ్, గోపి, శ్రీకాంత్, ఇతర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.